

ఆంధ్రభూమి వీక్లీ, 28 మార్చి 2002

# రిలీఫ్

"ఏమైంది? మళ్లీ బాస్ ఏమైనా అన్నారా?" అడిగింది రాధిక లతను.

అవునన్నట్టు తలూపి, "రాధికా... నేను ఎందుకు బ్రతుకుతున్నానో నాకే తెలియడం లేదు. ఆ భగవంతుడు ఆయన బదులు నన్ను తీసుకునిపోయివుంటే ఏ బాధా ఉండేది కాదు!"

"ఛ... ఏం మాటలవి?! నువ్వు లేకపోతే నీ బిడ్డ శిరీష గతి ఏమవుతుంది? భగవంతుడు ఏది చేసినా దానికి ఏదో కారణం ఉండేవుంటుంది. మనమే పరిస్థితులతో రాజీ పడాలి."

"ఎలా రాజీ పడమంటావు? ఉద్యోగం దొరికిందని సంతోషిస్తే- మేనేజర్ నా పాలిటి యముడిలా తయారయ్యాడు. భర్త పోయిన స్త్రీలంతా పరాయి పురుషుడి పొందుకోసం తపించి

పోతుంటారని వాడి ఉద్దేశం! నేను మెల్లగా చెప్పాను, అరిచాను, తిట్టాను... అయినా వాడు అలా మాట్లాడడం మానటం లేదు."

"అయితే ఒక పని చేద్దాం. మన యూనియన్ నాయకులకి ఫోన్ చేసి చెబుదాం!"

"వద్దు. దానివల్ల అతడు నాపై పగ పెంచుకునే అవకాశం ఉంది. నేను పనిలో ఏదైనా పొరపాటు చేస్తే దాన్ని అవకాశంగా తీసుకుని నాపై చర్య తీసుకోవచ్చు."

"మరేం చేద్దామంటావు?"

"నేనే వేరే ఊరికి ట్రాన్స్‌ఫర్ కోసం అప్లయ్ చేస్తాను."

"సరే... నీ ఇష్టం!"

– రాధిక అయిష్టంగానే అంగీకరించింది.

• • •

లత ట్రాన్స్‌ఫర్ అప్లికేషన్ టైపు చేసుకుని మేనేజర్ వేణుగోపాల్‌కి ఇచ్చింది.

అది చదివి అతను పెద్దగా నవ్వాడు.

తర్వాత లతతో– "ఓ.కే.! దీన్ని హెడ్ ఆఫీసుకి పంపాలి కదా... లెటర్ డిక్టేట్ చేస్తాను, తీసుకో!" అన్నాడు.

గబగబా పెన్సిలు, నోట్సు తీసుకుని సిద్ధమైంది లత.

"లత ట్రాన్‌ఫర్ అప్లికేషన్ పంపుతున్నాను. అయితే... లత చాలా మంచివర్కర్. ఆమె పనినీ, సిన్సియారిటీని నేను గమనిస్తున్నాను. అసలే స్టాఫ్ తక్కువగా వున్న ఇంత పెద్దబ్రాంచ్‌కి లతలాంటి ఉద్యోగిని సర్వీసెస్ ఎంతో అవసరం. కనుక ఆమె అభ్యర్థనను ప్రస్తుతానికి తిరస్కరించమని కోరుతున్నాను."

చెప్పడం ఆపి, ఆమెవైపు చూశాడు.

లత మనసు కోపంతో, అవమానంతో నిండిపోయింది. తన ట్రాన్స్‌ఫర్ అప్లికేషన్ ముక్కలుగా చించి వెళ్లిపోయింది.

జరిగింది విని రాధిక కూడా బాధపడింది.

"మనం ఒక పని చేస్తే..? వేణుగోపాల్ భార్యకు భయపడతాడని విన్నాను. మనం ఒకసారి ఆవిడని కలిసి విషయం చెబుదాము. ఆపైన మన అదృష్టం!" రాధిక అంది.

• • •

"నిన్న మనం వేణుగోపాల్ ఇంటికెళ్లి తప్పు చేశామనిపిస్తోంది. భార్య ద్వారా సంగతి తెలుసుకుంటే నన్ను వేధించడం ఇంకా ఎక్కువ చేస్తాడు."

"నువ్వేమీ భయపడకు లతా! నీతో నేనున్నాను. ఈ సమస్యకు పరిష్కారం నేనే కనుక్కుంటాను" రాధిక అంది.

ఇంతలో... అటెండర్ వచ్చి లతను మేనేజర్ పిలుస్తున్నాడని చెప్పాడు.

భయంగా చూసిన లతకు కళ్ళతోనే ధైర్యం చెప్పి, వెళ్లమంది రాధిక.

లతను చూసి "కూర్చో..." అన్నాడు వేణుగోపాల్.

భయంగా కూర్చుంది లత.

"కంగ్రాచ్యులేషన్స్ లతా! రాధిక నీకు బాగానే ధైర్యం నూరిపోసింది. అయినా నేను భార్యకు భయపడతానని ఎలా అనుకున్నావు? దీన్నిబట్టే నువ్వు ఎంత అమాయకురాలివో అర్థమవుతోంది."

తలవంచుకుని వినసాగింది లత.

"నువ్వు నా భార్యకి కంప్లయింట్ చేసినా నాకు నీమీద కోపం రావటం లేదు. ఎందుకంటే నేను నిన్ను ప్రేమిస్తున్నాను కనుక!"

"ప్లీజ్... దయచేసి నన్నొదిలేయండి! నన్ను మనశ్శాంతిగా బ్రతకనివ్వండి. భర్త పోయి సంవత్సరమయినా కాలేదు... ఆ బాధతోనే నేను కుమిలిపోతున్నాను. మీరు కూడా నన్నిలా వేధించకండి!" రెండుచేతులూ జోడించి కన్నీళ్లతో వేడుకుంది.

"ఓ.కే.! కూల్‌డౌన్... నిన్న డిక్టేట్ చేసిన లెటర్స్ అన్నీ టైప్ చేశావా?"

'చేశా'నన్నట్టు తలూపి, కళ్ళు తుడుచుకుని తన సీటుకు వచ్చింది లత.

ఏమైందన్నట్టు చూసిన రాధికను చూసి, "ఒక్క నిమిషం..." అని టేబుల్‌పై వున్న లెటర్స్ తీసుకుని మేనేజర్ గదిలోకి వెళ్లి అతని ముందు పెట్టింది.

లెటర్స్ పైన సైన్ చేస్తూనే-

"లతా! నేను నిన్నెంతగా కోరుకుంటున్నానో నువ్వు అంతగా నానుంచి దూరంగా ఉంటున్నావు. కానీ, నేను చాలా ఓపిక ఉన్నవాణ్ణి... నీ మనసు మారేవరకూ నా ప్రయత్నాలు మానను!" అన్నాడు వేణుగోపాల్.

సైన్ చేసిన పేపర్లు ఆమెకిస్తూ-

"వీటిని ఈరోజే హెడ్ ఆఫీసుకి పంపించు. నేను బయటికెళుతున్నాను. ఫోన్‌కాల్స్ ఏమైనా వస్తే అటెండవు!" అన్నాడు.

లత తలూపి బయటకొచ్చి, తన సీట్లో కూర్చుంటూ ఇంకా అక్కడే వున్న రాధికను చూసి ఆశ్చర్యపోయింది.

"ఏమన్నాడు?" రాధిక అడిగింది.

చెప్పింది లత.

"ముందు వెళ్లి ముఖం కడుక్కుని రా... బాగా ఏడ్చినట్టున్నావు! ఈలోపల నేను కవర్లు రెడీ చేసి ఈ లెటర్స్ డిస్పాచ్ చేయిస్తాను" అంది రాధిక.

• • •

ఆరోజు ఆఫీసుకి వచ్చిన లతకు శుభవార్త చెప్పింది రాధిక... వేణుగోపాల్‌కి ట్రాన్స్‌ఫర్ అయిందని!

"నిజమా..?" ఆశ్చర్యంగా అడిగింది లత.

"అతను నిన్ను వేధించినంత నిజం!" అంది రాధిక నవ్వుతూ.

ఆ తర్వాత వేణుగోపాల్ తన ట్రాన్స్‌ఫర్ క్యాన్సిల్ చేసుకోవడానికి ఎన్నో ప్రయత్నాలు చేశాడు. అయితే అతని పైఆఫీసర్లు తామేమీ చేయలేమని, అది ఎం.డీ. నిర్ణయమని చెప్పారు.

ఇంతలో... అతని స్థానంలో ఇంకో మేనేజర్ కూడా వచ్చేసరికి వారంరోజుల్లో రిలీవ్ అయి వెళ్లిపోయాడు.

"లతా! నువ్వేమీ అనుకోనంటే ఓ మాట... అతని ట్రాన్స్‌ఫర్‌కి నేనే కారణం!" అంది రాధిక.

"నువ్వా? ఎలా..?"

"చెప్తాను. నేను చేసిన పనికి నామీద కోపం తెచ్చుకోనని చెప్పు!"

"అలాగే... తొందరగా చెప్పు!"

"ఆరోజు నిన్ను వేణుగోపాల్ పిలవగానే నేను అతను రాసినట్టు ఒక లెటర్ టైప్ చేసి నువ్వు టైప్ చేసిన లెటర్స్‌తో పాటు కలిపి పెట్టాను. తర్వాత నువ్వు వచ్చి ఆ లెటర్లు పట్టుకెళ్లావు. నీమీద, నీ టైపింగ్ మీద ఉన్న నమ్మకంతో మేటర్ చదవకుండా సంతకం చేశాడు వేణుగోపాల్. పైగా... నిన్ను చూపుల్తో తింటూ, మాటల్తో వేధిస్తూ బిజీగా వుంటాడు కదా... అందుకే రిస్కు తీసుకుని అలా చేశాను. తర్వాత నిన్ను ముఖం కడుక్కోమని పంపించి ఆ లెటర్ డిస్పాచ్ చేశాను."

"ఇంతకీ... ఆ లెటర్ ఎవరికి రాశావు? ఏం రాశావు?'

"నువ్వే చదువు..." అంటూ తన బ్యాగ్‌లోంచి ఒక కాగితాన్ని లతకు ఇచ్చింది రాధిక.

లత చదవసాగింది...

*"ఎం.డి.గారికి!*

*నేను ఈ బ్రాంచ్‌లో రిపోర్ట్ చేసిన కొద్దిరోజుల్లోనే లత అనే ఆవిడ ఉద్యోగంలో చేరింది. ఆమె భర్త ఏక్సిడెంట్‌లో చనిపోతే అతని ఉద్యోగం ఆమెకు ఇచ్చారు. ఆమె అంటే ఇష్టం ఏర్పడింది నాకు. క్రమంగా అది మోహంగా మారింది. ఆమె పొందుకోసం రోజూ ఆమెను వేధించేవాణ్ణి. దీనివల్ల నా భార్యతో నాకు గొడవలు వచ్చాయి. ఇంట్లో మనశ్శాంతి కరువైంది. ఆమెను మరచి పోదామనుకుంటే నావల్ల కావడం లేదు. అందువల్ల దయచేసి నన్ను వేరే రాష్ట్రానికి బదిలీ చేయండి. ప్రశాంతంగా జీవనం చేస్తాను. నాలో మంచిమార్పుకు సహకరించండి. దయచేసి ఈ విషయం ఎవరికీ తెలియజేయకండి. నేను మళ్లీ తలెత్తుకు తిరగలేను. నాపై ఎలాంటి చర్య తీసుకోవద్దని వేడుకుంటున్నాను. నేను చేసిన పనికి నా భార్యాపిల్లలు రోడ్డున పడడం న్యాయం కాదు. మానవతాదృష్టితో నన్ను మన్నించి నాకు ట్రాన్స్‌ఫర్ ఇప్పించండి!*

*- వేణుగోపాల్"*

- ఇదీ ఇంగ్లీషులో టైపు చేయబడిన ఆ ఉత్తరం సారాంశం!

"నాకు చాలా సహాయం చేశావు. నీ ఋణం ఎలా తీర్చుకోవాలో తెలియడం లేదు" కృతజ్ఞతగా అంది లత.